
ప్రజాశక్తి
మంగళవారం 13 డిసెంబర్ 2022 | 5 | విజయనగరం



రీసర్వే ఆవశ్యకతను రైతులకు తెలపండి

విజయనగరం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే ఆవశ్యకతను రైతులకు విడమరిచి చెప్పాలని, వారికి ముందుస్తు నోటీసులు ఇచ్చిన తర్వాతే ప్రక్రియను మొదలు పెట్టాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి అధికారులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రీ-సర్వే ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, డ్రోన్ల వినియోగం, సాంకేతిక అంశాలపై జిల్లాలోని డిప్యూటీ తహాశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్ఒలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సమగ్ర భూ సర్వే ఆవశ్యకతను, ప్రయోజనాలను వివరించారు. సర్వే నిర్వహించే ముందు ఆయా గ్రామాల్లోని రైతులందరికీ ముందుస్తు సమాచారం తెలియపరచాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. డిటిలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, రీ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాల్సిన భాధ్యత వారిపైనే ఉందని పేర్కొన్నారు. సదస్సులో కెఆర్ఆర్సి విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్ సూర్యనారాయణ, సర్వే విభాగం సహాయ సంచాలకులు త్రివిక్రమరావులు పలు అంశాలపై సర్వేయర్లకు, విఆర్ఒలకు అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా ఆశావర్కర్ల మహాసభ

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభ అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆశావర్కర్లతో నగరమంతా సందడిగా మారింది. ఎర్రజెండా చేతబట్టి తమ సమస్యలు పరిష్కరించాలని చేసిన నినాదాలతో నగరం మార్మోగింది. మహాసభ సందర్భంగా వందలాది మంది ఆశా కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన మయూరి జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మీదుగా గురజాడ కళాభారతి వరకు కిలోమీటరు పొడవునా సాగింది. ప్రదర్శన అగ్రభాగంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, అధ్యక్షులు పోసమ్మ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరామమ్మ, సిఐటియు నాయకులు నడిచారు.



ప్రదర్శనలో పాల్గొన్న ఆశా వర్కర్స్ యూనియన్, కార్మిక సంఘాల నాయకులు, ఆశాలు

- నగరంలో భారీ ప్రదర్శన
- ఉద్యోగభద్రత, కనీస వేతనాల కోసం ఐక్య ఉద్యమం
- ఆశా కార్యకర్తలకు అండగా ఉంటాం
- బహిరంగ సభలో వక్తలు
- యూనియన్ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు పోసమ్మ



బహిరంగ సభలో మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ





బహిరంగ సభలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోసమ్మ, ధనలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళాభారతి ఆడిటోరియంలో ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే నిధులకు కోత పెడుతోందని, రాష్ట్రాల హక్కులను హరిస్తోందని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా వచ్చిన ఆశా వర్కర్లు రాష్ట్రంలో ఉండాల్సిన వారి కంటే తక్కువగా ఉన్నారని, ఫలితంగా పని భారం పడుతోందని అన్నారు. ఆశా వర్కర్లకు కేవలం రూ.10వేలు వేతనం ఇవ్వడం అన్యాయమని, 7వ వేతన సంఘం సిఫార్సు మేరకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో వైపు ప్రజలు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాడకుండా కులం, మతం పేరుతో విభజన రాజకీయాలు మోడీ ప్రభుత్వం చేస్తుందన్నారు. మరో వైపు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సమస్యలపై అడిగితే ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడుతోందన్నారు. ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్, పెన్షన్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మాదిరిగానే సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోసం ఆశావర్కర్లు చేసే పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల మంతా అండగా ఉంటామన్నారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. ఆశా వర్కర్లు చేసిన సేవలను గుర్తించకుండా ఆత్మాభిమానం దెబ్బతీసే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర పనులు నుంచి తప్పించాలన్నారు. ఆశా వర్కర్లను పట్టించుకోకపోతే కుర్చీలు కదలుతాయని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై మహాసభలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సబ్బరావమ్మ మాట్లాడుతూ కరోనా సమయంలో. సేవలు అందించిన ఆశా వర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. నేడు అనేక పరిశ్రమల్లో కార్మికులను తొలగించడం, పరిశ్రమలను మూసేయడం, స్టీల్ ప్లాంట్ అమ్మేయడం వంటి పాలన సాగుతుంద న్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జనవరి 6న జరిగే దేశ వ్యాప్త పోరాటాలకు స్కీమ్ వర్కర్లు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సుధారాణి మాట్లాడుతూ పోరాట ఫలితంగానే యూనిఫాం, బకాయిలు సాధించుకున్నా మన్నారు.కోవిడ్ సమయంలో ఇద్దరు ఆశా వర్కర్లు చనిపోతే పోరాడి రూ.50 లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియో సాధించుకున్నామన్నారు. విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు టివి రమణ మాట్లాడారు.



బహిరంగ సభకు హాజరైన ఆశా కార్యకర్తలు



అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యూనియన్ నాయకులు



ఆకట్టుకున్న ఆశా కార్యకర్తల కోలాటం

ఆర్థిక సంస్కరణల్లో మార్పుతోనే
స్కీమ్‌వర్కర్లకు న్యాయం

నిరంజనా నిరూలా నగర్ మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో (ఎస్.కన్వెన్షన్) వేదికగా మహాసభ ఘనంగా ప్రారంభమైంది. తొలుత యూనియన్ జెండాను రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నాయకులు, ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రతినిధుల సభలో ముందుగా మల్లు స్వరాజ్యం, అలిండియా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రంజానా నిరూలా మృతికి, కరోనాతో చనిపోయిన ఆశా కార్యకర్తల మృతికి నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధులనుద్దేశించి పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. నూతన ఆర్థిక విధానాలతో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి, ప్రైవేట్, కార్పొరేట్ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పోరాడి ఏర్పాటు చేసుకున్న స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా స్టీల్ ప్లాంట్, గంగవరం పోర్టు, కృష్ణపట్నం వద్ద థర్మల్ స్టేషన్‌ను అదానీకి అమ్మేస్తున్నారన్నారు. విభజన హామీలు అమలు చేయడం లో కేంద్రం నిర్లక్ష్యంగా ఉన్నా రాష్ట్రంలో అధికార,ప్రతిపక్ష పార్టీలు పట్టించుకోవడంలేదని అన్నారు. ఆర్థిక సంస్కరణల్లో మార్పులు వస్తే తప్ప స్కీం వర్కర్లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం జరగదన్నారు. ప్రభుత్వ విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని కోరారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ నూతన విద్యా విధానం తీసుకొచ్చి అంగన్వాడీ కేంద్రాలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఐక్యంగా పోరాడితే తప్ప మనకి మనుగడ ఉండదని, సాధించుకున్న హక్కులు, చట్టాలను కాపాడుకోలేమని అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు అవసరమని, ఆ దిశగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి మాట్లాడుతూ హక్కులు గురించి అడిగితే ప్రభుత్వం నిర్బంధం విధిస్తోందన్నారు. స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం అన్యామన్నారు. ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు.

మళ్లీ 400 కోట్ల అవినీతికి సిద్ధమయ్యారు
మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు


ప్రజాశక్తి-గజపతినగరం

మళ్లీ రూ.400 కోట్ల అవినీతికి అధికార పార్టీ నాయకులు సిద్ధమయ్యారని మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు ఆరోపించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా ధాన్యం కొనుగోళ్లలో ఏడాదికి రూ.400 కోట్ల అవినీతి జరుగుతోందని, నాలుగో ఏటా దోపిడీ చేయడం మొదలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది 40 కేజీలకి బదులు 43 నుండి 45 కిలోల వరకు తీసుకొని రైతుని మోసం చేశారన్నారు. ఈ ఏడాది కూడా కొనుగోలు ప్రారంభమైన చోట అదనంగా 2 నుంచి 4 కిలోల వరకు తీసుకున్నట్లు తెలిసిందన్నారు. గతంలో రైతుల నుండి దోచుకున్న డబ్బులను ఎమ్మెల్యేలు, మిల్లర్లు, అధికారులు పంచుకున్నారని ఆరోపించారు. ఈసారి అధికార పార్టీకి చెందిన వాలంటీర్లను కూడా కొనుగోలులో చేర్చి, అదే బాటలో వెళ్తుండటం దారుణమన్నారు. ఈ చర్యలు మానుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి బండారు బాలాజీ, మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, నాయకులు లెంక బంగారు నాయుడు, గుంప్రోతు గోవింద, సర్పంచ్ రుంకాన అరుణ పాల్గొన్నారు.

మోసపోయాం.. న్యాయం చేయరూ..
తహాశీల్దార్‌కు చామలాపల్లి దళితుల వినతి

ప్రజాశక్తి-వేపాడ

రుణలిప్పిస్తామంటూ సంతకాలు తీసుకుని, భూములు లాక్కొరని, తమ భూములు తిరిగి ఇప్పించాలని చామలాపల్లి దళితులు సోమవారం తహాశీల్దార్ కృష్ణంరాజుకు వినతి అందించారు. దళిత నాయకులు తాడి అచ్చారావు, గ్రామ నాయకులు కుంచి కోటి కలిసి తమకు తెలియకుండానే సంతకాలు తీసుకుని, భూములు అమ్మేశారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో 12 మంది దళితులకు 24 ఎకరాలను పంపిణీ చేశారని, ఆ భూములే తమ జీవనాధారమని, నిరక్షరాస్యులైన తమను మోసం చేశారని వాపోయారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, తిరిగి భూములిప్పిస్తామని హామీనిచ్చారని వివరించారు. ఎస్‌సి కార్పొరేషన్ అధికారులమంటూ కొందరు వచ్చి ఆధార్, పాస్‌పుస్తకాలు అడిగారని, గట్టిగా ప్రశ్నిస్తే ఉడాయించారని తహాశీల్దార్‌కు తెలిపారు. తహాశీల్దార్ స్పందిస్తూ ఆ భూములు కట్టా కాశీవిశ్వనాథం పేరిట ఉన్నాయని, ఎంఆర్ఐ రామలక్ష్మిని పంపించి విచారణ చేయిస్తానని తెలిపారు. ఎవరు వచ్చినా ఏమీ ఇవ్వవద్దని సూచించారు. వినతి అందజేసిన వారిలో కాటపల్లి నూకరత్నం, కుంచి రమణమ్మ, మట్ట రాములమ్మ, చింతకాయల సూరిదేవుడమ్మ, తదితరులున్నారు.



తహాశీల్దార్ కృష్ణంరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న చామలాపల్లి దళితులు

అర్జీదారులకు సరైన సమాధానాన్ని అందించాలి

స్పందనకు 143 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 143 వినతులు అందాయి. అత్యధికంగా రెవిన్యూ కు సంబంధించి 97 వినతులు అందాయి. ముఖ్యంగా సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. వినతులను కలెక్టరు ఎ. సూర్య కుమారి, డిఆర్ఒ గణపతి రావు, ఉప కలెక్టర్లు సుదర్శనదొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులతో మాట్లాడి వారికి సరైన సమాధానాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ అవసరాలపై అందిన ఆర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజా అవసరాల కోసం పదే పదే రాకూడదని త్వరగా పరిష్కరించాలని సూచించారు.



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

ఎయిర్‌పోర్టు పరిహారంలో అవకతవకలు

భోగాపురం : భోగాపురం ఎయిర్‌పోర్టు పరిహారం విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని టిడిపి నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాళ్లపాలెం గ్రామంలో కొంతమంది రైతులకు ఎక్కువ, మరికొంతమందికి తక్కువ పరిహారం అందిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యాన రైతులు వివరించారు. వెంటనే రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, సీనియర్ నాయకులు కోరాడ తాతారావు, శీరపు శ్రీను, కర్రోతు రాజు, చింతపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

మైనారిటీల పరిస్థితి దయనీయం

విజయనగరం కోట : కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని ఎపిసిసి మైనార్టీ విభాగం నాయకులు మహమ్మద్ హాసన్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతినిచ్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సచార్ కమిటీ నివేదిక తర్వాత దేశంలో మైనార్టీ పరిస్థితి దళిత గిరిజనుల కంటే దయనీయంగా ఉందని తెలిసి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సాహకంగా మైనార్టీ స్కాలర్‌షిప్ పెట్టిందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంచలంచెలుగా కొద్దికొద్దిగా తగ్గించి ఇప్పుడు మొత్తానికి ఎత్తివేసిందని తెలిపారు. ఇప్పటికే స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకొని పాఠశాల ద్వారా ఫార్వర్డ్ చేసుకున్న దరఖాస్తులను కూడా రద్దు చేయడం అన్యాయమని అన్నారు. ఈ చర్యను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించి పునరుద్దరణకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు.

కచ్చితంగా ప్రమాదాల వివరాలు నమోదు

ప్రజాశక్తి-విజయనగరం


రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి వివిధ విభాగాల అధికారులను ఆదేశించారు. నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది స్పందించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆమె పలు మార్గదర్శకాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, కాలయాపన కారణంగా, లేదా ఇతర కారణాల వల్ల ఒక్క వ్యక్తి కూడా చనిపోడానికి వీలులేదని అధికారులను హెచ్చరించారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకొనే ప్రాంతాలకు సమీపంలో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్ఐసి కేంద్రంగా సేవలందించే ఐరాడ్ యాప్‌లో కూడా వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎస్‌పి ఎం.దీపిక డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వి.సుందర్, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, వైద్యారోగ్య శాఖ, పోలీసు శాఖ అధికారులు, ఐరాడ్ విభాగ జిల్లా మేనేజర్ శ్రీధర్, ట్రాన్స్‌పోర్టు అధికారులు, జాతీయ రహదారి విభాగ అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ గణేష్

హెచ్‌బిఎల్ ఆక్రమణపై ఫిర్యాదు

పూసపాటిరేగ : మండలంలోని కందివలసలో హెచ్‌బిఎల్ పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడుతోందని సర్పంచ్ దేశెట్టి గణేష్, ఎంపిటిసి సభ్యులు చాపల సత్తిబాబు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. పరిశ్రమకు సమీపంలో ఉన్న సర్వేనెంబర్ 141/1లో 1.78 ఎకరాల గెడ్డవాగు, 144/1లో 2.48 ఎకరాల పోరంబోకు, గెడ్డవాగు ఆక్రమణకు పాల్పడి పరిశ్రమకు ప్రహరీ నిర్మించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో పునాది కూడా తవ్వుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే సర్వే చేయించి, చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.



నిరసన దీక్ష చేస్తున్న జర్నలిస్టులు

ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కారానికి
జర్నలిస్టుల నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

సుదీర్ఘ కాలంగా వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న ప్రెస్ క్లబ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ప్రెస్ క్లబ్ సాధన పేరిట చేపట్టిన ఈ దీక్షలో జర్నలిస్టులు బి.డేవిడ్ రాజు, సిహెచ్ సింహాద్రి జైరాజ్, గంగుల శివ ప్రసాద్ కూర్చున్నారు. ప్రెస్ క్లబ్ అడహక్ కమిటీ సభ్యులు గమిడి కోటేశ్వరరావు, ఎంఎంఎల్ నాయుడు, కె.రమేష్ నాయుడు, అవనాపు సత్యనారాయణ, పాత్రో, వెంకట్, ప్రయోగల రాజు, మల్లికార్జున తదితరులు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ నగరంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రెస్ క్లబ్ లో భాగస్వామ్యం కల్పించి, తద్వారా జర్నలిస్టుల సంక్షేమానికి దోహద పడాల్సిన ప్రెస్ క్లబ్ గత ఐదు ఏళ్లుగా ఎటువంటి నిర్వహణ లేక అచేతన స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రెస్ క్లబ్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లగా, నెల రోజుల్లో సమస్య పరిష్కరించాలని డిపిఆర్‌ఒకు ఆదేశించారని తెలిపారు. ఆరు నెలలైనా ప్రెస్ క్లబ్ సమస్య కొలిక్కి రాలేదని అన్నారు. అక్రిడేటెడ్, నాన్ అక్రిడేటెడ్ అంటూ నగరంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులను రెండుగా విభజించడంతో ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి ప్రెస్‌క్లబ్‌లో అందరికీ సభ్యత్వం కల్పించాలని కోరారు. దీక్షా శిబిరాన్ని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.మధుసూదనరావు సందర్శించి, మద్దతిచ్చారు. అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు.

యూత్ వాలీబాల్ పోటీలకు తరుణ్‌కుమార్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 16 నుంచి 22వరకు మధ్య ప్రదేశ్ రాష్ట్రం పన్నాలో జరగనున్న అలిండియా యూత్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారుడు ఎం.తరుణ్ కుమార్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడ్ని జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కష్ణంరాజు, భగవాన్‌దాస్‌లు అభినందించారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరానికి తాగునీటి సరఫరా జరుగుతున్న ముషిడిపల్లి పంపింగ్ స్టేషన్ నుంచి విజయనగరం వరకు గల పైపులైను లీకులను అరికట్టేందుకు పనులు చేపట్టనున్నందున మంగళవారం, బుధవారాల్లో 17 నుంచి 45 డివిజన్ వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇఇ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస, చల్లవానితోట రైతు భరోసా కేంద్రాల పరిధిలో శ్రీరామాంజనేయ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిపి మహంతి కళ్యాణి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జజ్జురోతు అప్పలరాజు, ఉప సర్పంచ్ గొర్లె రమణ, నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి శంకరరావు, జజ్జురోతు ఈశ్వరరావు, వ్యవసాయాధికారి నీలిమ, శ్రీరామాంజనేయ ఎఫ్‌పిఒ సిఇఒ ప్రభాకర్, విఎఎలు అమల్‌రాజ్, ప్రియాంక, టిఎలు రాజేశ్వరి, అనూష, డిఇఒ ప్రదీప్, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అలజంగి గ్రామంలో సోమవారం ఎడి యం.శ్యాం సుందర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు.

బొండపల్లి : మండలంలోని గొల్లుపాలెం రైతుభరోసా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిపి చల్ల చలంనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వేదవతి, ఎఒ మల్లికార్జునరావు, సర్పంచ్ పోతల రమణమ్మ, ఎంపిటిసి జి.దేవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. సోమవారంజిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐలు జె.మురళి, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నీరజ ఎంపిక

ప్రజాశక్తి-కొత్తవలస

ఆలిండియా యూత్ వాలీబాల్ టోర్నమెంటుకు దెందేరు పూర్వ విద్యార్థిని విరోతి నీరజ ఎంపికైనట్లు పీడీ కె.కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు దెందేరు పాఠశాలలో హెచ్ఎం బి.సునీత, స్టాఫ్ సెక్రటరీ పి.చిన్నం నాయుడు, ఉపాధ్యాయులు.. నీరజను అభినందించారు.


నీరజను అభినందిస్తున్న కృష్ణంరాజు

రీసర్వేతో రైతులకు ప్రయోజనం

ప్రజాశక్తి-గుర్ల

భూముల రీసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనమని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. సోమవారం జమ్ము గ్రామంలో భూముల రీ సర్వేను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, బంగారు నాయుడు, సర్పంచ్ నరసింహమూర్తి, మండల సర్వేయర్ శివ పాల్గొన్నారు.

ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-డెంకాడ

స్థానిక భవిత కేంద్రంలో సోమవారం వికలాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం ఏర్పాటుచేశారు. భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన 120 మంది విద్యార్థులు శిబిరానికి హాజరయ్యారు. డాక్టర్ మేఘన, డాక్టర్ రామకృష్ణరాజు పరీక్షలు చేసి, వారికి ఏ ఉపకరణం అవసరమో గుర్తించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, జిల్లా సహిత విద్య సమన్వయకర్తలు సూర్యనారాయణరావు, ఎ.భారతి, భవిత కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు

ప్రజాశక్తి -వేపాడ

పిహెచ్‌సిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంపిపి డి.సత్యవంతుడు తెలిపారు. వేపాడ పిహెచ్‌సిలో నాడు–నేడు నిధులతో ఏర్పాటు చేసిన హ్యాండ్‌వాష్ సామగ్రిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి కమిటీ ఛైర్మన్ ఈర్ల సన్యాసినాయుడు, వైద్యాధికారి ఎ.ధరణి, కె.రాజు, సిహెచ్‌ఒ ఆంజనేయులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి వేపాడ

జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు మండలంలోని అంబేద్కర్ గురుకులం, కెజిబివి, మోడల్ స్కూల్, వేపాడ, సోంపురం హైస్కూళ్ళ, కెజిపూడి జిఎస్‌డబ్ల్యుహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు నోడల్ ప్రధానోపాధ్యాయులు పి.బాలభాస్కరరావు తెలిపారు.

పాలనలో వైసిపి విఫలం : టిడిపి

ప్రజాశక్తి -గరివిడి

పాలనలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. సోమవారం చీపురుపల్లిలోని టిడిపి కార్యాలయంలో గరివిడి మండలం కొండదాడి గ్రామానికి చెందిన పలువురు నాగార్జున సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, పి.సాయిరాజు, మహంతి రమణమూర్తి, జంపాన శ్రీనివాసరాజు, సూర్యారావు, ఎర్రప్పడు, లక్ష్మణ పాల్గొన్నారు.

ఆకులపేటలో 'ఇదేం కర్మ'

డెంకాడ : మండలంలోని ఆకులపేటలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి రాష్ట్రానికి పట్టిన కర్మను వదిలించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పతివాడ సూరిబాబు, నాయకులు ఎల్ల సత్యనారాయణ, పతివాడ సత్తిబాబు, పతివాడ రవి, పాండ్రంగి సూర్యనారాయణ, గెద్ద శ్రీను, బి.అప్పారావు, గెద్ద నారాయణరావు, గెద్ద దుర్గారావు, గెద్ద నాగరాజు పాల్గొన్నారు.

నేడు వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి-కొత్తవలస

వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని కొత్తవలసలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్ హాజరుకానున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

నేరాలను అరికట్టేందుకు కృషి

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రామాల్లో నేరాలు అరికట్టేందుకు కృషి చేయాలని సిఐ ఎస్.బాల సూర్యారావు అన్నారు. స్థానిక 202 కాలనీలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రహిమాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా జెపిఎల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి ఎంపిపిలు అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ ఛైర్మన్ డాక్టర్ అవనాపు భావన దంపతుల ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. ఆదివారం ఎంతో వైభవంగా ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో సోమవారం 10 టీముల మధ్య ఐదు మ్యాచ్‌లు జరిగాయి. అవనాపు విక్రమ్ ఈ మ్యాచ్‌లను దగ్గరుండి పర్యవేక్షిస్తూ క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఆయన చూపిస్తున్న అభిమానానికి క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు

ప్రజాశక్తి-బొబ్బిలి

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్ఐ జి.పోలినాయుడు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై రాజా కళాశాల వద్ద కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్ధ్యానికి మించి ప్రయాణికులను ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో ట్రాఫిక్ ఎస్ఐలు సన్యాసిరావు, పెంటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు

ఉత్తమ గ్రామాలకు ప్రోత్సాహకాలు : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించే విధంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ప్రజా ప్రణాళిక ప్రచారం-2022లో భాగంగా, గ్రామస్థాయి, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీపై విజయనగరం మండల పరిధిలోని ప్రజాప్రతినిధులకు, అధికారులకు, స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ, ప్రజలను భాగస్వాములను చేస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకొని గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. జనవరిలో ఉత్తమ గ్రామాలను ఎంపిక చేస్తామని, మొదటి బహుమతి కింద రూ.20లక్షలు, ద్వితీయ బహుమతి కింద రూ.10 లక్షలు నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. అభివృద్ధిలో గ్రామాల మధ్య పోటీతత్వాన్ని పెంచడమే దీని వెనుక లక్ష్యమని కోలగట్ల స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథ్, గాజులరేగ అధ్యక్షులు జమ్ము మధుసూదనరావు, వైస్ ఎంపిపిలు కె,నారాయణరావు, కొసర నిర్మల, ఎంపిడిఒ గంటా వెంకటరావు, తాహశీల్దార్ బంగార్రాజు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ప్రజావసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సర్పంచులకు, ఎంపిటిసిలకు పంచాయతీ ప్రణాళికల తయారీ పై శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎ.భాస్కరరావు, జెడ్‌పిటిసి సభ్యులు శాంత కుమారి, వైస్ ఎంపిపి శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి కోరారు. ఎంపిడిఒ జి.గిరిబాల ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు శిక్షణ ఏర్పాటుచేశారు. ఎంపిపి మాట్లాడుతూ అభివృద్ధి పనులు గుర్తించి ప్రతిపాదనలు, ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములునాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు యర్ర రమణ, యడ్ల రమణ పాల్గొన్నారు.

గుర్ల : గ్రామాల అభివృద్ధికి పంచాయతీ పాలకులు, అధికారులు కలిసికట్టుగా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల సూచించారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయం సిబ్బందికి ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు 9 అంశాలపై రోజుకు క్లస్టర్ వారికి శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, బంగారు నాయుడు, ఎంపిడిఒ కళ్యాణి, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన పంచాయతీ ప్రణాళికల తయారీపై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయిలో జిడిపి యాక్షన్ ప్లాన్‌లో ప్రథమ స్థానంలో తీసుకురావాలన్నారు.


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

వైస్ ఎంపిపిలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, లెంక రత్నాకర్ నాయుడు, ఎంపిడిఒ పాండ్రంకి త్రివిక్రమరావు, టిఒటి శిక్షకులు సిహెచ్. రామకృష్ణ, కె.వెంకట్రావు, పంచాయతీ అధికారి వి.వి.రవికుమార్, ఎపిఎం దేవుడు బాబు, అంగన్వాడీ సూపర్వైజరు హైమావతి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : భవిష్యత్తు అవసరాల గుర్తింపే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల అవసరాలూ ఒకేలా ఉండవన్నారు. పంచాయతీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. అదే సమయంలో ఆదాయ వనరులపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గుర్ల, నెల్లిమర్ల.. శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపిపిలు ప్రమీల, సుధారాణి

పేదల అభ్యున్నతే లక్ష్యం


వేపాడ.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి-బొబ్బిలి

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలో నాలుగో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి కొళాయిలు కావాలని వార్డు ప్రజలు ఎమ్మెల్యేను కోరగా, కొళాయిల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ ఛైర్‌పర్సన్ చెలికాని మురళీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, కౌన్సిలర్ పందిరపల్లి అమనమ్మ, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గజపతినగరం : ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. సోమవారం మండలంలోని కొణిస గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిప బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడు, ఎఎంసి ఛైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, వైసిపి నాయకులు సీరంరెడ్డి రామ్‌కుమార్, పల్లి సంజీవరావు, మండల సురేష్, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ కె.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు..'లో ఎమ్మెల్యేలు

విజయనగరం టౌన్ : నగరంలోని 37వ డివిజన్ విటి అగ్రహారం బిసి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ దృష్టికి వచ్చిన సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని ఆతవ గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇంతవరకు అమలుచేసిన సంక్షేమ పథకాలు గడపగడపకు వెళ్లి లబ్ధిదారులకు అందుతున్నవి, లేనివి తెలుసుకున్నారు. అందని వారి వివరాలు కూడా సేకరించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి ఛైర్మన్ చినరామునాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సర్పంచ్ కొంప వేమననాయుడు, ఎంపిటిసి రాయవరపు రాజేష్, పద్మావతి, వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, నాయకులు సతీష్, సత్యనారాయణ, బొడ్డు శీను పాల్గొన్నారు.


గజపతినగరం.. ఆర్‌బికెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

టిడిపిలో చిచ్చు

- నియోజకవర్గ ఇన్‌ఛార్జి తీరుపై అసహనం
- అధిష్టానానికి ఫిర్యాదు చేసే యోచనలో వేపాడ నాయకులు


ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలో నిన్న మొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న టిడిపి శ్రేణుల్లో చిచ్చు మొదలైందా? గ్రూపులకు ఆజ్యం పోశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తీరుపై మండలంలోని పార్టీ శ్రేణుల్లో సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది. ఇన్‌ఛార్జిపై మండల నాయకులు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

శృంగవరపుకోట నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో టిడిపి పరాజయం పాలైన తరువాత వేపాడ మండలం నుంచే ప్రక్షాళన ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షులుగా గొంప వెంకటరావు బాధ్యతలు స్వీకరించాక పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అహర్నిశలూ శ్రమించారు. టిడిపి అధిష్టానం ధరల పెరుగుదలపై ప్రతిష్టాత్మకంగా పిలుపునిచ్చిన బాదుడేబాదుడు కార్యక్రమం అమల్లో వేపాడ మండలాన్ని జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలబెట్టారు. గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి, బలోపేతం చేస్తున్నారు. మండలంలోని టిడిపి శ్రేణులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేశారు. ఇలాంటి తరుణంలో శృంగవరపుకోటలో మంగళవారం ఎన్ఆర్ఐ గొంప కృష్ణ నిర్వహించే సేవా కార్యక్రమాలకు టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్ నుంచి మండలంలోని పార్టీ శ్రేణులకు పిలుపు అందింది. కానీ అదే కార్యక్రమానికి టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావుతోపాటు పలువురు నాయకులను రావద్దని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హుకుం జారీ చేసినట్లు తెలిసింది. నియోజకవర్గ స్థాయిలో చేపట్టే కార్యక్రమానికి శృంగవరపుకోట, లక్కవరపుకోట, జామి, కొత్తవలస మండలాల నాయకులను పిలిచి, వేపాడ శ్రేణులను పక్కన పెట్టడంతో ఇన్‌ఛార్జి తీరుపై మండల నాయకులంతా అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

కారణం అదేనా?

ఇటీవల శృంగవరపుకోటలో జరిగిన వెలమ సంఘం సమావేశానికి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు హాజరయ్యారు. ఇదే కారణాన్ని చూపి, తరువాత నుంచి వెంకటరావుతోపాటు మండల నాయకులను నియోజకవర్గ ఇన్‌ఛార్జి లలితకుమారి దూరం పెడుతున్నారని టిడిపి శ్రేణుల్లో చర్చ సాగుతోంది. అదే సమావేశానికి మిగతా మండలాల నాయకులు హాజరైనా తమపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించామని, కష్టపడి పనిచేసిన వాళ్లను పక్కన పెట్టడం సరికాదని అంటున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి తీరుపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని గొంప వెంకటరావుతోపాటు నాయకులు చెబుతున్నారు.


ఎన్నికైన సభ్యులతో జిల్లా అధ్యక్షులు మురళి

ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - భోగాపురం

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎపిఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు మురళి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎన్‌జిఒ సంఘం తాలూకా ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా కొమ్మూరు దుర్గారావు, కార్యదర్శిగా గంటా సంతోష్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.జగదీశ్వరరావు, ట్రెజరర్‌గా టి.బి.ఎస్.వర్మ, ఉపాధ్యక్షులుగా కె.దశరథరాం, ఆర్.వి గణపతిరావు, సి.ఎచ్.సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా సత్య నారాయణ, ఐ.రమణమ్మ, టి.శాంతిలత, మహిళా జాయింట్ కార్యదర్శిగా పి.కృష్ణవేణి, ఇసి సభ్యులుగా ఎ.సుధాకర్, కె.శ్రీనివాసరావు, పి.వి.రమణయ్య, ఎస్.లక్ష్మణరావు, కె.కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నకల అధికారిగా కె.రాధిక వ్యవహరించారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-వేపాడ

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై మంగళ, బుధవారాల్లో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ప్రజాప్రతినిధులతోపాటు సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ముగ్గురికి 18 నెలల జైలు

ప్రజాశక్తి-తెర్లాం

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురికి 18 నెలల జైలు, 3000 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. రంగప్పవలసకి చెందిన రాగోలు నీలవేణి పట్ల ధమరసింగి రామకృష్ణ, ధమరసింగి శ్రీనివాసరావు, ధమరసింగి అప్పన్న 2017 ఏప్రిల్‌లో అసభ్యకరంగా ప్రవర్తించారని కేస్ నమోదు చేశారు. వాటిపై విచారణ జరిపిన అనంతరం బొబ్బిలి పిజెసిజె మెజిస్ట్రేట్ ఎం.సరోజిని.. 18 నెలలు జైలు, జరిమానా విధించారు.

ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కాగితాపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు తన సిబ్బందితో సోమవారం దాడులు చేపట్టారు. పేకాట ఆడిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. వీరి నుండి 9,330 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని రాజాం కోర్టుకు తరలించారు.

విఆర్‌ఒల సమస్యలపై నిరసనలు


డెంకాడ.. నిరసన చేపడుతున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి-డెంకాడ

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం విఆర్‌ఒలు నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఆదిలక్ష్మికి వినతి అందించారు. ఈ సందర్భంగా విఆర్‌ఒలు మాట్లాడుతూ పనిఒత్తిడి కారణంగా మరణించిన విఆర్‌ఒల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. రీసర్వే, పిఒఎల్‌ఆర్ పేరుతో విఆర్‌ఒలతో పెట్టించిన ఖర్చులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 100 రోజుల్లో సర్వే పూర్తిచేయాలన్న నిబంధన సడలించాలన్నారు. విఆర్‌ఎల నుంచి గ్రేడ్-2 విఆర్‌ఒలుగా పనిచేస్తున్న 3795 మందికి ప్రొబిషన్ డిక్లేర్ చేసి, పేస్కేల్ అమలు చేయాలని కోరారు. సచివాలయాల్లో విఆర్‌ఒలకు కంప్యూటర్‌తోపాటు స్టేషనరీ ఇవ్వాలన్నారు. విఆర్‌ఒలకు పనిఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒల సంఘం నాయకులు అప్పలనాయుడు, రామ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం విఆర్‌ఒలు.. తహశీల్దార్ కృష్ణంరాజుకు వినతి అందించారు. తహశీల్దార్ స్పందిస్తూ విఆర్‌ఒల సమస్యలను ఉన్నతాధికారులను నివేదిస్తానని చెప్పారు.

కొత్తవలస : పని ఒత్తిడి కారణంగా మృతి చెందిన విఆర్‌ఒ కుటుంబాలను ఆదుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కాకర మల్లేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మండలంలోని విఆర్‌ఒలు తహశీల్దార్ ఎం.ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు.


కొత్తవలస.. వినతి అందిస్తున్న విఆర్‌ఒలు

మహాయజ్ఞంలా గృహ నిర్మాణాలు

టిడ్కో ఛైర్మన్ జమ్మాన

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలు మహాయజ్ఞంలా సాగుతున్నాయని టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. రామన్నదొరవలస సమీపంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరులో 1248, బొబ్బిలిలో 1688 టిడ్కో ఇళ్లు మార్చి నెలాఖరికి పూర్తి చేసి ఏప్రిల్ మొదటి వారంలో గృహ ప్రవేశాలు చేస్తామన్నారు. పర్యావరణం దెబ్బ తినకుండా టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎస్ఇ నర్సింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి, డిఇ బాలకృష్ణ, ఎఇ ప్రవీణ్, పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణమూర్తి పాల్గొన్నారు.


టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న టిడ్కో ఛైర్మన్ జమ్మాన

బిల్లులు చెల్లిస్తేనే..

టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న సందర్భంగా అక్కడున్న కాంట్రాక్టర్‌తో టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడారు. ఎప్పటిలోగా ఇళ్లను పూర్తిచేస్తారని అడిగారు. కాంట్రాక్టరు స్పందిస్తూ బిల్లులు ఎప్పకప్పుడు చెల్లిస్తేనే మార్చి నెలాఖరికి పూర్తిచేయగలమని, లేకుంటే పనులు పూర్తిచేయలేమని సమాధానమిచ్చారు.

అసమానతలు తొలగించాలి

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్

సమాజంలో లింగ వివక్షత అసమానతలు తొలగించేందుకు, బాలికలపై, స్త్రీలపై లైంగిక దాడులను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె సి రాజు అన్నారు. సోమవారం పాఠశాలలో లింగ వివక్ష పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మహేష్, రామచంద్ర రావు విద్యార్థులు పాల్గొన్నారు.

మెంటాడ : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన లింగ వివక్షతకు వ్యతిరేకంగా స్థానిక వైకెపి కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులతో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ ఆడపిల్లలపైన అత్యాచారాలు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, లెంక రత్నాకర్ నాయుడు, ఎపిఎం గొల్లు దేవుడుబాబు, సిసిలు వెంకట్రావు, సత్యనారాయణ, అప్పలరాజు పాల్గొన్నారు.

గంట్యాడ : స్థానిక వైకెపి కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని అధ్యక్షులు వి.అప్పయ్యమ్మ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్, ఆర్థిక లావాదేవీలు, ఆన్‌లైన్‌లో నమోదు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రామ సంఘాల పనితీరు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కొటారుబిల్లి జంక్షన్‌లో లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాసులు, శైలేష్, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.